

బడి బస్సులు భద్రమేనా?

విద్యాసంస్థల బస్సులను ఆర్టీఏ కార్యాలయాలకు తీసుకురాకుండానే 'ఫిట్‌నెస్' చేయించుకున్నట్లు తెలుస్తోంది. 8లో



కళలపై మక్కువ..

గిరిజన విద్యార్థులకు చదువుతోపాటు కళలపై ఆసక్తి పెంపొందించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం 31° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం ఒకటి, రెండు జల్లులు కురుస్తాయి. ఆ తర్వాత ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కమనీయంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారికి బుధవారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

అప్రమత్తంగా ఉండాలి

- వర్షాల నేపథ్యంలో హెల్ప్‌లైన్ల ఏర్పాటు
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెంటౌన్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ బి.రోహిత్‌రాజు సూచించారు. ఈ మేరకు బుధవారం వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. వర్షాలతో నదులు, వాగులు, చెరువులు పొంగి రోడ్లపైకి వరదనీరు చేరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, బయటకు వస్తే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పొంగి పొర్లుతున్న వాగులు, చెరువులు, నదుల వద్దకు సెల్ఫీల కోసం వెళ్లి ప్రమాదాలకు గురికావొద్దని హెచ్చరించారు. విపత్కర పరిస్థితుల్లో కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లోని హెల్ప్‌లైన్ల నంబర్లకు, డయల్ 100కు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు సమాచారం అందించి సహాయం పొందవచ్చని వివరించారు. రెవెన్యూ, పోలీస్, రోడ్లు, భవనాల శాఖ, మున్సిపల్, పంచాయతీ శాఖల అధికారులు సమన్వయం తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరదల్లో, ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు డీడీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంటాయని వివరించారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

08744-241950 – కలెక్టర్ కార్యాలయం

08743-232444 – భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం

వాట్సాప్ నంబర్లు

9347910737 – భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం

9392919747– కలెక్టర్ కార్యాలయం

ఎందుకిలా..?

కృష్ణా ఆయకట్టు స్థిరీకరణ పనులకు నిధుల మంజూరు

- మంత్రుల ఇలాఖాలో వేగంగా జరుగుతున్న పనులు
- జిల్లాలో మాత్రం ముందుకు సాగని ఎత్తిపోతల పథకాలు
- ఏజెన్సీ ప్రాంతమైనా నిధులు విదల్చని ప్రభుత్వం



కరకగూడెం మండలంలోని పెద్దవాగుపై పులుసు బొంత ప్రాజెక్టు నిర్మించేందుకు ఎంపిక చేసిన స్థలం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ జోన్–3 కింద ఉన్న ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు జవహర్ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. రూ.600 కోట్లతో ప్రాజెక్టు నిర్మించనుండగా, సాగర్ జలాలతో సంబంధం లేకుండా ఐదు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. అంతకుముందు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని రఘునాథపల్లి మండలంలో నాలుగు వేల ఎకరాలకు నాగార్జునసాగర్ జలాలు అందించేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకం చేపట్టారు. వెనువెంటనే పాలనాపరమైన అనుమతులతోపాటు రూ.66 కోట్లు మంజూరు చేశారు. నాగార్జునసాగర్ ఆయకట్టు స్థిరీకరణ కోసమే గతేడాది సీతారామ ప్రాజెక్టులో అదనంగా రాజీవ్ కెనాల్‌ను చేర్చి రికార్డు వేగంతో పనులు పూర్తి చేశారు.

లిఫ్టులకు నిధుల గ్రహణం

మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో సాగర్ ఆయకట్టు స్థిరీకరణ పనులకు నిధులు గలగల ప్రవహిస్తున్నాయి. కానీ గోదావరి జలాలను ఏజెన్సీ రైతుల పొలాల్లో పారించేందుకు ఉద్దేశించిన చిన్న, మధ్య తరహా ఎత్తిపోతలకు నిధుల గ్రహణం పడుతోంది. నాగార్జున సాగర్ ఆయకట్టు స్థిరీకరణపై మంత్రులు చూపుతున్న శ్రద్ధనే, కనీస ఆయకట్టు లేని గిరిజన, ఏజెన్సీ రైతుల మీద కూడా చూపాలని జిల్లా వాసులు కోరుతున్నారు. జిల్లాలో గోదావరి, కిన్నెరసాని, ముర్రేడు, పెద్దవాగు లాంటి జలవనరులు పుష్కలంగా ఉన్నాయి. ప్రతిష్టాత్మక సీతారామ ప్రాజెక్ట్ ఇక్కడే నిర్మిస్తున్నారు. దీని వల్ల అడవులు, భూమిని ఈ జిల్లానే నష్టపోయింది. కానీ, ఇప్పటివరకు జిల్లాలో ఒక్క ఎకరాకు గోదావరి నీరు ఇవ్వలేకపోయారు. కనీసం సీతారామకు ఇరువైపులా ఉన్న పినపాక, భద్రాచలం నియోజకర్గాలకు కూడా న్యాయం జరగడం లేదు.

కదలని 'మారెళ్లపాడు'

మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి 2023 జనవరిలో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు వ్యయం కేవలం రూ. 25 కోట్లు. సీతారామ ప్రాజెక్టు మొదటి పంప్‌హౌస్ (బీజీ కొత్తూరు) సమీపంలో ప్రధాన కాలువ నుంచి నీటిని ఎత్తిపోతల ద్వారా తీసుకుని తుమ్మల చెరువు, చింతల చెరువు, ఎర్రబొక్కల చెరువు, తీగల చెరువులను నింపుతారు. తద్వారా అశ్వాపురం, మణుగూరు మండలాల్లోని 17 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. శంకుస్థాపన జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు మినీ పంప్‌హౌస్ ఎర్త్ వర్క్ కొంత పూర్తి చేయడం మినహా మరేం చేయలేదు. ఇక్కడ లిఫ్టుతోపాటే మారెళ్లపాడు డిస్ట్రిబ్యూటరీ కాల్వల కోసం రూ.90 కోట్లతో గతంలో సిద్ధం చేసిన ప్రతిపాదనలు ఎప్పుడో అటకెక్కాయి. కనీసం ఈ ప్రాజెక్టు పూర్తి చేసినా భద్రాద్రి జిల్లాకు సీతారామ తొలి ఫలాలు అందేవి.

పులుసుబొంత రీడిజైన్‌కే పరిమితం

తెలంగాణ ఏర్పాటుకు ముందే కరకగూడెం మండలంలో 4,500 ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు పెద్దవాగుపై పులుసుబొంత ప్రాజెక్ట్‌కు ఉమ్మడి ఏపీలో శ్రీకారం చుట్టారు. అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి రూ.20.10 కోట్లు కేటాయిస్తూ 2014 ఫిబ్రవరిలో ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత రాష్ట్ర విభజన జరిగాక దాదాపు తొమ్మిదేళ్లపాటు అడుగు ముందుకు పడలేదు. రెండేళ్ల కిందట ఆయకట్టును 35 వేల ఎకరాలకు పెంచుతూ సుమారు రూ.400 కోట్లతో పులుసుబొంత ప్రాజెక్ట్‌కు రీడిజైన్ చేయించారు. నష్టపోయే అటవీ భూమికి ప్రత్యామ్నాయ భూములు ఎక్కడ ఇవ్వాలనే అంశంపై స్పష్టత వచ్చిన దశలో ప్రభుత్వం మారిపోయింది. దీంతో మళ్లీ మరుగునపడింది. ఇదే తరహాలో పినపాక మండలంలోని చింతల బయ్యారం, టి.కొత్తగూడెం ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి.

ప్రతిపాదనల్లోనే ప్రగళ్లపాడు

తాలిపేరు ప్రాజెక్టు కింద చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో 24,700 ఎకరాల ఆయకట్టు ఉంది. దీన్ని మూడు జోన్లుగా విభజించారు. ఖరీఫ్‌లో పూర్తి స్థాయిలో 24,700 ఎకరాలకు సాగునీరు అందుతుంది. రబీకి వచ్చే సరికి రొటేషన్ పద్ధతిలో ఒక్కో జోన్‌లో ఉన్న ఎనిమిది వేల ఎకరాలకే నీరు అందుతోంది. తలాపునే గోదావరి ఉన్న ఈ రెండు మండలాల్లో రెండు పంటలు సాగు చేయడం సాధ్యం కావడం లేదు. దుమ్ముగూడెం మండలం కోసం గతంలో రూ.634 కోట్లతో ప్రగళ్లపాడు ఎత్తిపోతల పథకానికి అంచనాలు రూపొందించినా కార్యరూపం దాల్చలేదు.

గోదావరి, జలాశయాలకు వరద..



పెదవాగు ప్రాజెక్ట్‌లో చేరిన వరద నీరు



కిన్నెరసాని జలాశయంలో పెరిగిన నీటిమట్టం

భద్రాచలంటౌన్/పాల్వంచరూరల్/అశ్వారావుపేటరూరల్/టేకులపల్లి: రెండు, మూడు రోజులుగా ఎగువన, పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద ప్రవాహం పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరిలో మంగళవారం రాత్రికి 13 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం బుధవారం రాత్రి 12 అడుగులకు తగ్గి నిలకడగా ప్రవహిస్తోంది. కిన్నెరసాని ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, ఎగువ ప్రాంతాల నుంచి 4,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. జలాశయం నీటిమట్టం మంగళవారం 396.80 అడుగులు ఉండగా, బుధవారం 397.50 అడుగులకు పెరిగింది. అశ్వారావుపేటలోని పెదవాగు ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తగా రింగ్‌బండ్ జలకళ సంతరించుకుంది. రింగ్‌బండ్ లెవల్ దాటితే నీళ్లు క్రస్ట్ గేట్ల నుంచి బయటకు వెళ్తున్నాయి. వర్షంతో టేకులపల్లిలోని సింగరేణి కేటీసీలో 8,269 టన్నుల బొగ్గు ఉత్పత్తితోపాటు ఓబీ వెలికితీత నిలిచిపోయింది. ఓసీలోని నీటిని ఎత్తిపోస్తున్నారు.

గతేడాది రూ.1.39లక్షలు.. ఈసారి రూ.38వేలు

పెద్దమ్మ గుడి వద్ద షాప్‌నకు తగ్గిన ఆదాయం

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మగుడిలో వివిధ పనులు అప్పగించేందుకు బుధవారం వేలం నిర్వహించారు. నాలుగో నంబర్ షాపును గతేడాది రూ.1.39లక్షలతో అప్పగించగా ఈసారి తాటి వీరభద్రం రూ.38వేలకే దక్కించుకున్నాడు. దీంతో ఆలయానికి రూ.లక్షకు పైగా ఆదాయం తగ్గినట్లయింది. అలాగే, తలనీలాల పోగు చేసుకునే హక్కును రూ.9.75లక్షలతో నల్లగొండకు చెందిన ఏ.నాగయ్య దక్కించుకోగా గతేడాడితో పోలిస్తే రూ.25వేలు, ఫొటోలు తీసుకునేందుకు రూ.95వేలకు జగన్నాథపురానికి చెందిన వై.సుష్మిత దక్కించుకోగా గతేడాది కంటే రూ.22వేల ఆదాయం పెరిగింది. ఇంకొన్ని షాప్‌లు, ఇతర పనులకు వేలం నిర్వహించినా ఎవరూ రాకపోవడంతో 18వ తేదీకి వాయిదా వేశారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి వెంకట్రావు, ఈఓ రజనీకుమారి, ఆలయ చైర్మన్ బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. రైతుల హర్షం

- రెండు రోజుల్లో లోటు నుంచి అధిక వర్షపాతం నమోదు
- పత్తి 1,90,831 ఎకరాల్లో సాగు, మొక్కజొన్న 54,223 ఎకరాల్లో..
- జిల్లాలో సాధారణం కంటే 14 శాతం అధిక వర్షపాతం



మొక్కజొన్న మొక్కలకు ఎరువులు వేస్తున్న రైతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైతన్నల్లో హర్షం వ్యక్తమవుతోంది. జూన్ మాసంలో లోటు వర్షపాతం నమోదైంది. రెండు రోజుల నుంచి వానలు దంచి కొడుతుండటంతో వ్యవసాయ పనులను వేగవంతం చేశారు. ఈ సీజన్ ప్రారంభంలో రుతుపవనాలు ముందుగానే ఊరించాయి. ఆ తర్వాత ముఖం చాటేశాయి. దీంతో నాటిన పత్తి విత్తనాలు మొలకెత్తక రైతులు నష్టపోయారు. ఆ తర్వాత వర్షాలు కొంతమేర కురిసినా గత నెలలో లోటు వర్షపాతమే నమోదైంది. మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలకు లోటు పూడిపోయింది. గత నెల 1 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 180 మి.మీ కాగా 205.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే సాధారణం కంటే 14 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. తొమ్మిది మండలాలు అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ, టేకులపల్లి, జూలూరుపాడు సుజాతనగర్, బూర్గంపాడు, పాల్వంచలలో అధిక వర్షపాతం నమోదైంది. మరో తొమ్మిది మండలాలు ములకలపల్లి, చర్ల, అశ్వాపురం, ఆళ్లపల్లి, ఇల్లెందు, చుంచుపల్లి, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, భద్రాచలం మండలాల్లో సాధారణ వర్షపాతం, మిగిలిన ఐదు మండలాలు పినపాక, కరకగూడెం, దుమ్ముగూడెం, మణుగూరు, గుండాలలో లోటు వర్షపాతం నమోదైంది.

పంటల సాగు ఇలా..

జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట పత్తిని వర్షాధారంగా సాగు చేస్తారు. రుతుపవనాలు ఊరించడంతో విత్తనాలు నాటిన సుమారు 30 శాతం మంది రైతులు మొక్కలు మొలవక నష్టపోయారు. ఆ తర్వాత అడపాదడపా వర్షాలతో పత్తి సాగు ఊపందుకుంది. సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు వరినార్లు పోశారు. జీలుగు, జనుము సాగు చేసిన రైతులు పచ్చిరొట్టను కలియదున్నేందుకు సిద్ధమవుతున్నారు. ఇక కొందరు రైతులు వెదజల్లే పద్ధతిలో వరి సాగు ప్రారంభించారు. అక్కడక్కడా నాట్లు కూడా వేస్తున్నారు. ఇప్పటివరకు వెదజల్లే పద్ధతిలో 2,124 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. పత్తి 1,90,831 ఎకరాల్లో మొక్కజొన్న 54,223 ఎకరాల్లో సాగు చేశారు.

వర్షపాతం ఇలా.. (మి.మీ లలో)

మండలం	బుధవారం	జూన్ 1 నుండి జూలై 2 వరకు
కరకగూడెం	25.2	112.4
పినపాక	26.4	114.8
చర్ల	31.2	211.8
దుమ్ముగూడెం	36.6	145.6
అశ్వాపురం	55.6	211.8
మణుగూరు	34.6	151.6
ఆళ్లపల్లి	36.8	163.8
గుండాల	28.0	122.8
ఇల్లెందు	52.6	157.2
టేకులపల్లి	56.2	214.8
జూలూరుపాడు	49.2	367.2
చండ్రుగొండ	38.0	284.2
అన్నపురెడ్డిపల్లి	36.4	236.8
చుంచుపల్లి	59.2	171.0
సుజాతనగర్	65.4	214.2
కొత్తగూడెం	49.0	176.8
లక్ష్మీదేవిపల్లి	35.4	142.4
పాల్వంచ	86.2	286.8
బూర్గంపాడు	81.6	293.2
భద్రాచలం	64.6	206.2
ములకలపల్లి	52.2	179.2
దమ్మపేట	23.0	227.0
అశ్వారావుపేట	13.6	337.2
జిల్లా సరాసరి	45.1	205.6

ముమ్మరంగా వ్యవసాయ పనులు



వర్షాలు కురుస్తుండటంతో జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. ఎక్కువ మంది రైతులు పత్తి సాగు చేస్తున్నారు. వ్యవసాయాధికారుల సలహాలను పాటించి సాగు చేయాలి.

–వి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

పనులు వేగవంతం చేశాం



ఇప్పటివరకు వర్షాలు భయపెట్టినా ఇప్పుడు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. సాగుకు అనుకూలం. అందుకే వ్యవసాయ పనులు వేగవంతం చేశాం.

–మల్లయ్య, రైతు, గరీబ్‌పేట, సుజాతనగర్ మండలం

కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలి

ములకలపల్లి: గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని కొత్తగూడెం ఓఎస్డీ జి.నరేందర్ సూచించారు. మండల పరిధిలోని కమలాపురం శివారులో చలమన్ననగర్ గొత్తికోయ గ్రామస్తులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం గొడుగులు, పలకలు, బలపాలు అందజేశారు. ఈ సందర్భంగా ఓఎస్డీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. బడి ఈడు పిల్లలను విధిగా పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు తెలిపారు. తొలుత ములకలపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, ఎస్సై కిన్నెర రాజశేఖర్, మాజీ సర్పంచ్ కారం సుధీర్ పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

నిర్మించిన ఎనిమిది నెలలకే బీటలు వారిన గుడిపాడు సీసీ రోడ్డు



- కార్పొరేషన్‌తోపాటు మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి
- వీధుల్లో గుంతలమయంగా మారిన రహదారులు
- అన్నిచోట్లా వాహనదారులకు తప్పని అవస్థలు

సాక్షి ఫోకస్

పురపాలికల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలమయంగా తయారయ్యాయి. వర్షాలకు నీరు నిలిచి రోడ్లు ఇంకా పాడవుతున్నాయి. వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు వీధుల్లో వాహనాలు నడపాలంటే అవస్థ పడుతున్నారు. శివారు, విలీన ప్రాంతాల్లో కచ్చా రోడ్లు బురదమయంగా మారాయి. మిషన్ భగీరథ పైపులైన్ పనుల కోసం తవ్విన చోట సరిగ్గా పూడ్చకపోవడంతో గుంతలు ఏర్పడి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట పట్టణాల్లో రోడ్లు మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నాయి.

సీసీ రోడ్లకు బీటలు

పాల్వంచ: పాల్వంచ పట్టణంలో సీసీ రోడ్లు నాణ్యత లేకుండా నిర్మించడంతో బీటలువారి నిధులు దుర్వినియోగమయ్యాయి. వర్షాలకు ఆ రోడ్లు మరింత దెబ్బతింటున్నాయి. మిషన్ భగీరథ పైపులైన్ల కోసం ఇటీవల అనేక చోట్ల సీసీ రోడ్లను ధ్వంసం చేశారు. వాటిని సరిచేసేందుకు నెలల తరబడి పనులు చేపడుతున్నారు. ఒడ్డుగూడెం రోడ్‌లో పైపులైన్ల లీకేజీలతోపాటు, కొత్త కనెక్షన్ల కోసం మట్టి తీసి, సీసీ రోడ్లు తవ్వారు. గుడిపాడు వెళ్లే దారిలో 8 నెలల క్రితం సీసీ రోడ్డు నిర్మించారు. మార్కెట్ ఏరియాలో నూతనంగా రోడ్డు వేశారు. ఇవి బీటలు వారుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో బీటలు వారి గతుకులమయంగా తయారవుతున్నాయి.

ఎనిమిది నెలలకే బీటలు



పట్టణంలోని శివారు ప్రాంతం గుడిపాడుకు ఎనిమిది నెలల క్రితం సీసీ రోడ్డు నిర్మించారు. నాణ్యత లేకుండా పనులు చేపట్టడంతో రహదారి బీటలు వారింది. ఎన్నో సంవత్సరాలు ఉండాల్సిన రోడ్డు దుస్థితి ఇప్పటికే దెబ్బతింది. అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో ప్రజాధనం దుర్వినియోగమవుతోంది.

–ఆరెం ప్రశాంత్, గుడిపాడు

కాలినడకా కష్టమే



మోడల్ కాలనీలోని ఓ రోడ్డు దుస్థితి

అశ్వారావుపేట: మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీ, పాత పేరాయిగూడెం, దొంతికుంట, అటెండర్స్ కాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, బీఎస్ఆర్ నగర్ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. సీసీ రహదారులు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో కాలినడక కూడా కష్టంగానే ఉంటోంది. పేద, మధ్యతరగతి ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లో రోడ్లు నిర్మించడంలేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళల్లో నడక కష్టమే



మోడల్ కాలనీలో అన్ని వీధుల్లో సీసీ రహదారులు నిర్మించలేదు. గుంతలు, పిచ్చిమొక్కలతో ఇబ్బందిగా ఉంటోంది. పాములు సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించాలంటే భయంగా ఉంటోంది.

–ఆదినారాయణ, మోడల్ కాలనీ



కొత్తగూడెంలో కోర్టుకు వెళ్లే రహదారిపై నిలిచిన వర్షపు నీరు

కార్పొరేషన్‌లో అధ్వానం..

కొత్తగూడెంఅర్బన్: మున్సిపల్ కార్పొరేషన్‌లోని కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. సీసీ, బీటీ రోడ్లలో గుంతలు పడ్డాయి. ప్రధాన పోస్టాఫీసు సెంటర్ నుంచి మొదలుకొని కోర్టు వరకు, అక్కడి నుంచి శేషగిరినగర్ వరకు కూడా అడుగడుగుకో గుంత ఉంది. ఆ రూట్‌లో భారీ వాహనాలు నడవడంతో గుంతలు ఏర్పడ్డాయి. పాతకొత్తగూడెం, రామవరంలోని సుభాష్ చంద్రబోస్ నగర్ ఏరియాలో మిషన్ భగీరథ పైపులైన్ కోసం తవ్వకాలు జరిపి పూడ్చకుండానే వదిలేశారు. వర్షాలకు గుంతల్లో నీరు నిల్వడంతో చిన్న పిల్లలు పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. సెవెన్‌హిల్స్ ఏరియా రోడ్డు నుంచి బూడిదగడ్డ వరకు కూడా రోడ్డు విస్తరణలో భాగంగా రెండు వైపులా తవ్వకాలు జరిపారు. ఆరు నెలలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. సూపర్‌బజార్ నుంచి రైతుబజార్ వెళ్లే రోడ్డులో కూడా గుంతలు అధికంగా ఉన్నాయి. రోడ్లపై ప్రయాణించలేకపోతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

రోడ్ల నిర్మాణం చేపట్టాలి



పాతకొత్తగూడెంలోని పాతూరులో రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. మిషన్ భగీరథ పైపులైన్ల కోసం తవ్వకాలు జరిపి పూడ్చకుండా వదిలివేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. గుంతలను పూడ్చాలి.

–ఇందిరమ్మ, పాతకొత్తగూడెం



కమలాపురంలో గుంతలమయంగా మారిన రోడ్డు

అన్నీ గుంతలే..

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలో విసిరేసినట్లుగా ఉండే కమలాపురంలో రోడ్డు గుంతలమయంగా మారింది. రాయిగూడెం వైపు నుంచి ఇసుక లారీలు భారీ లోడ్లతో వెళ్తుండటంతో రోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. రోడ్లు బాగు చేసి డ్రెయిన్లు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల చెవికి ఎక్కడంలేదు. మున్సిపాలిటీలో అంతర్గత రోడ్లు మొత్తం సుమారు 40 కిలోమీటర్లు ఉండగా, కమలాపురంలోని సుమారు ఒక కిలోమీటరు బీటీ రోడ్డు నిర్మించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బాగు చేయాలి



మణుగూరులో వానాకాలం వచ్చిందంటే రోడ్లన్నీ గుంతలమయంగా మారతాయి. పాలకులు దృష్టి సారించి ఎప్పటికప్పుడు అంతర్గత రహదారులకు మరమ్మతులు చేపట్టాలి. మురుగు కాల్వలు నిర్మించాలి.

– మునిగెల వీరమ్మ, కమలాపురం గ్రామస్తురాలు

విలీన వార్డుల్లో బురద..

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలోని నాలుగు విలీన వార్డులు ఉన్నాయి. వీటిల్లో అన్నీ కచ్చా రోడ్లే ఉండటంతో వర్షాకాలంలో బురదలో నడవాల్సిందే. చినుకు పడితే నేలంతా చిత్తడిగా మారుతోంది. పట్టణంలోని 1వ వార్డు సత్యనారాయణపురం పూర్తిగా సుదిమళ్ల గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీలో విలీనం చేశారు. 2వ వార్డు, 22వ వార్డులో, 23వ వార్డుల్లో కూడా విలీన గ్రామాలే ఉన్నాయి. వీటిల్లో ఇప్పటికీ కచ్చా రోడ్లు ఉన్నాయి. గ్రామపంచాయతీలుగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన రోడ్లే తప్ప మున్సిపాలిటీలో విలీనం చేశాక కొత్తగా రోడ్లు నిర్మించలేదు. దీంతోపాటు పట్టణంలోని 24 వార్డుల్లో మిషన్ భగీరథ పైపులైన్ పనుల కోసం రోడ్లు తవ్విన ప్రదేశాలు గుంతలమయంగా మారాయి.



సత్యనారాయణపురం ప్రాంతంలో బురదమయంగా మారిన రోడ్డు

కాలుబయట పెట్టలేం



సత్యనారాయణపురంలో వానాకాలంలో అడుగు బయట పెట్టాలంటే బురదలో దిగాల్సిందే. చినుకు పడితే నేలంతా చిత్తడిగా మారుతుంది. విలీన వార్డుల్లో అన్ని మట్టి రోడ్లే ఉన్నాయి. బీటీ రోడ్లు నిర్మించాలి.

– బి.గోపి, 1వ వార్డు, ఇల్లెందు

క్లుప్తంగా

ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయుడు



గురుమూర్తి, విశ్వసన్నిధ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య

జూలూరుపాడు: ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తాను పని చేసే పాఠశాలలోనే తన ఇద్దరు పిల్లలను చేర్పించి ఆదర్శంగా నిలిచాడు. జూలూరుపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నంద్రు గురుమూర్తి పెద్ద కుమారుడు నిశాంత్‌ను ఇదే పాఠశాలలో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివించాడు. గతేడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నిశాంత్ 563 మార్కులు సాధించాడు. ఈ విద్యాసంవత్సరంలో ఆయన తన చిన్నకుమారుడు విశ్వసన్నిధ్‌ను 7వ తరగతిలో చేర్పించాడు. బుధవారం గురుమూర్తిని హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

విత్తన లైసెన్స్ సస్పెన్షన్

సుజాతనగర్: అనుమతులు లేని ప్రదేశంలో విత్తనాలు విక్రయించిన సుజాతనగర్ మండల కేంద్రంలోని ఓ విత్తన దుకాణంపై వ్యవసాయాధికారులు చర్యలు తీసుకున్నారు. సుజాతనగర్‌లోని హేమంత్ కృష్ణ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణానికి చెందిన డీలర్ నిబంధనలకు విరుద్ధంగా చంద్రుగొండ మండలంలో ఇటీవల విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడ్డాడు. విచారణ అనంతరం దుకాణానికి సంబంధించిన విత్తన లైసెన్స్‌ను జిల్లా వ్యవసాయాధికారి సస్పెండ్ చేసినట్లు ఏఓ జి.నర్మద బుధవారం తెలిపారు.

బాలిక గర్భానికి కారణమైన బాలుడిపై పోక్సో కేసు

కామేపల్లి: పద్నాలుగేళ్ల బాలికను ప్రేమిస్తున్నానని మాయమాటలు చెబుతూ లోబర్చుకున్న పదిహేడేళ్ల బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కామేపల్లి పోలీసులు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక 9వ తరగతి చదువుతుండగా, మరో గ్రామానికి చెందిన బాలుడు ప్రేమ, పెళ్లి పేరిట మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. ఆమెకు ఇటీవల కడుపునొప్పి రాగా కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లడంతో పరీక్షించగా గర్భం దాల్చినట్లు తేలింది. కుటుంబీకుల ఫిర్యాదుతో బాలుడిపైనే కాక ఆయన స్నేహితుడిపై పోక్సో కేసు నమోదు చేసి బాలికను భరోసా కేంద్రానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై...

బోనకల్: మండలంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.వెంకన్న తెలిపారు. మూడో తరగతి చదివే బాలికపై లక్ష్మీకాంత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు ఏడుస్తూ వెళ్లి తల్లికి చెప్పగా ఆమె ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేశారు. కాగా, ఏసీపీ రెహమాన్ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు.

ప్రేమ పేరుతో వేధిస్తున్న వ్యక్తిపై..

బోనకల్: ప్రేమ పేరుతో యువతిని వేధిస్తున్న వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి. వెంకన్న తెలిపారు. వైరాకు చెందిన ఆదూరి బాలు నాలుగేళ్లుగా కలకోటకు చెందిన యువతిని ప్రేమిస్తున్నానంటూ వెంటపడడమే కాక ఆమెకు వస్తున్న పెళ్లి చెడగొడుతున్నాడు. దీంతో యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య



హేమసాగర్ (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): పురుగులమందు తాగి యువకుడు మృతిచెందిన ఘటన బుధవారం రామవరంలో చోటుచేసుకుంది. కొత్తగూడెం ఏరియా పీవీకే–5 ఇంక్లెన్ గనిలో ఎల్లగొండ రఘు పనిచేస్తున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు. చిన్నవాడైన ఎల్లగొండ హేమసాగర్ (25) హైదరాబాద్‌లో క్యాబ్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం యువకుడు పురుగులమందు తాగాడు. గమనించిన స్థానికులు ఆయన్ను ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు హుటాహుటిన హైదరాబాద్ తరలివెళ్లారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హేమసాగర్ బుధవారం మృతిచెందాడు. కాగా, అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

హైవేపై వర్షపు నీరు

తల్లాడ: తల్లాడ రింగ్ సెంటర్‌లోని జాతీయ రహదారిపై వర్షం నీరు నిల్వ ఉండడంతో నేషనల్ హైవే అధికారులు బుధవారం పరిశీలించారు. వర్షం వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి ఎదురవుతుండగా.. నేషనల్ హైవే సైట్ ఇంజనీర్ జి.కిరణ్ తదితరులు పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అయితే, రహదారిపై చెత్తాచెదారం పేరుకుపోవడమే సమస్యకు కారణమని, చెత్త తొలగిస్తే నీరు నిల్వ ఉండదని ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. ఈమేరకు అవసరమైన మరమ్మతులు చేయిస్తామని అధికారులు వెల్లడించారు.



పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,463

బడి బస్సులు భద్రమేనా?

- ఫిట్‌నెస్ లేకున్నా కొన్ని బస్సులకు సర్టిఫికెట్ల జారీ
- 33 బస్సుల లైఫ్‌టైం ముగిసినట్లు నిర్ధారణ
- ఇంకా కొన్ని ఫిట్‌నెస్ పరీక్షలకు రాని బస్సులు



కొత్తగూడెంలో బస్సును తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారి (ఫైల్)

కొత్తగూడెంటౌన్: విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఆయా విద్యాసంస్థలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు చేయించాల్సి ఉంటుంది. విద్యాసంస్థల బస్సులను ఆర్టీఏ కార్యాలయాలకు కొందరు తీసుకురాగా మరికొందరు తీసుకురాకుండానే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2025 ఏప్రిల్ నుంచి జూన్ 30 వరకు దాదాపు 1,392 వాహనాలను తనిఖీల్లో పట్టుకుని సీజ్ చేయగా నిబంధనలు పాటించని వాహనాల ద్వారా ఫైన్‌ల రూపంలో దాదాపుగా రూ.2కోట్ల 26లక్షలను ఆర్టీఏ అధికారులు రాబట్టా రు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా దాదాపు 256 విద్యాసంస్థలకు చెందిన బస్సులు ఉన్నాయి. మే నుంచి జూన్ 27 వరకు 219 బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు చేయించినట్లు, అవి ఫిట్‌గా ఉన్నట్లు తేలింది. మరో 33 బస్సులు లైఫ్‌టైం ముగియడం, అందులో కొన్ని ఇంకా ఫిట్‌నెస్ టెస్టులకు రాలేదని జిల్లా రవాణాశాఖ ఇన్‌చార్జ్ అధికారి (ఆర్టీఏ) వెంకటరమణ తెలిపారు. అయితే మే నెలలో దాదాపు చాలావరకు బస్సులను ఫిట్‌నెస్ కోసం కార్యాలయానికి తీసుకురాలేదని, జూన్ నెలఖరు వచ్చే సరికి 219 బస్సులను రవాణాశాఖ కార్యాలయానికి ఫిట్‌నెస్ టెస్టు కోసం తీసుకువచ్చి పరీక్షలు చేయించినట్లు తెలుస్తోంది. విద్యాసంస్థలు ప్రారంభమైనప్పటికీ ఆర్టీఏ అధికారులు బడి బస్సుల ఫిట్‌నెస్‌పై తూతూమంత్రంగా టెస్టులు నిర్వహించారని, ఫిట్‌నెస్‌సాధించిన బస్సుల్లోనూ చాలా వరకు ఫిట్‌గా లేవని, అయినా ధికారులు ధ్రువీకరించారని విమర్శలు ఉన్నాయి.

పరీక్షలు పూర్తి చేశాం..



జిల్లాలో విద్యాసంస్థలకు చెందిన బస్సులు 256 ఉండగా 219 బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు పూర్తి చేశాం. విద్యాసంస్థల బస్సులతోపాటు వివిధ వాహనాలను తనిఖీ చేసి రూ.2.26 కోట్లను జరిమానాల రూపంలో వసూలు చేశాం. ఫిట్‌నెస్‌లు లేకుండా బస్సులు తిరిగితే చర్యలు తప్పవు. మరో 33 బస్సుల లైఫ్‌టైం ముగిసింది. కొన్ని బస్సులు ఇంకా ఫిట్‌నెస్ టెస్టులకు రాలేదు. ప్రతి ఒక్కరూ రవాణాశాఖ నియమ, నిబంధనలు పాటించాలి.

–వెంకటరమణ, ఇన్‌చార్జ్ రవాణాశాఖ అధికారి

కార్యాలయానికి రాకుండానే..

చాలా విద్యాసంస్థల బస్సులు రవాణాశాఖ కార్యాలయానికి రాకుండానే ఫిట్‌నెస్ చేయించుకున్నట్లు చర్చ జరుగుతోంది. విద్యాసంస్థలు ప్రారంభం కాక ముందు ఫిట్‌నెస్ చేయించాల్సిన బస్సులను యాజమాన్యాలు తీసుకురాకుండా.. తమ పలుకుబడితో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందినట్లు సమాచారం. అధికారుల నిర్లక్ష్యం కూడా తోడు కావడంతో జూన్ చివరి వరకు కూడా ఇంకా కొన్ని బస్సులకు ఫిట్ నెస్ టెస్టులు పూర్తికాలేదని తెలుస్తోంది. అనుమతులు లేకుండా బస్సులు తిరుగుతున్నప్పటికీ అధికారులు ఆయా యాజమాన్యాల ఒత్తిడితో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వందల సంఖ్యలో బస్సులు ఉంటే మూడు లేదా నాలుగు బస్సులకు నామమాత్రంగా జరిమానా విధించి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రోజూ విద్యార్థులను బస్సుల ద్వారా ఇంటి నుంచి స్కూల్‌కు.. స్కూల్ నుంచి ఇంటికి చేరవేరుస్తారు. ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై తిప్పి, విద్యార్థుల ప్రాణాలకు ముప్పు తెస్తే ఎవరు బాధ్యత వహిస్తారనే ఆందోళన ప్రస్తుతం వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా 256 బస్సులు ఉండగా 219 ఫిట్‌నెస్ సాధించాయని, మరో 33 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాల్సి ఉందని ఇన్‌చార్జ్ రవాణాశాఖ అధికారి వెంకటరమణ వెల్లడించారు.

షిరిడీ, తిరుపతికి రైళ్లు...!



భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్

- డీఆర్‌యూసీసీ సమావేశంలో చర్చ
- చిగురిస్తున్న భక్తులు, ప్రజల ఆశలు
- రద్దయిన రైళ్లకు మోక్షం కలిగేనా?
- అత్యధిక ఆదాయం వచ్చే కొత్తగూడెం స్టేషన్‌పై డీఆర్‌ఎం దృష్టి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం కార్పొరేషన్‌గా రూపాంతరం చెందడంతో భవిష్యత్ వ్యాపార, వాణిజ్య పరంగా ఇతర ప్రాంతాల నుంచి గతంలో కంటే రాకపోకలు పెరిగే అవకాశం ఉంటుంది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రానికి కూడా భక్తులసంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎంతోమంది భక్తులు భద్రాచలం వచ్చి శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకుని ఇక్కడి నుంచే షిరిడీ, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లాలని అనుకుంటుండగా రైళ్ల సౌకర్యం లేక ఆగిపోతున్నారు. షిరిడీ, తిరుపతికి కొత్తగూడెం నుంచి రైళ్లు నడిపించాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. ఎన్నోసార్లు మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినప్పటికీ ఫలితం కానరాలేదు. ఇదిలా ఉండగా గత మంగళవారం హైదరాబాద్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్‌ఎం భర్తేశ్‌కుమార్‌జైనీ ఆధ్వర్యంలో డీఆర్‌యూసీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కొత్తగూడెం నుంచి డీఆర్‌యూసీసీ సభ్యులు శ్రీనివాసరెడ్డి పాల్గొని ఇక్కడి సమస్యలు వివరించారు. కరోనా సమయంలో రద్దయిన రైళ్ల పునరుద్ధరణ, షిరిడీ, తిరుపతికి రైళ్ల ఏర్పాట్లు, కాకతీయ రైలును మణుగూరు వరకు పొడిగించడం, బెల్గావి రైలు పునరుద్ధరణ లాంటి అంశాలను లేవనెత్తినట్లు ఆయన తెలిపారు. అధికారుల నుంచి సానుకూల స్పందన రావడంతో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలు సాగించే రైళ్లు ఇలా..

కొత్తగూడెం రైల్వేస్టేషన్ నుంచి నడిచే రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడి నుంచి ఏడు రైళ్లు రాకపోకలు సాగించేవి. సింగరేణి, కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు, డోర్నకల్, విజయవాడ కాజీపేట, కాకతీయ ప్యా సింజర్లతోపాటు మణుగూరు సూపర్‌ఫాస్ట్ సర్వీసులు నడిచేవి. ప్రస్తుతం మణుగూరు సూపర్‌ఫాస్ట్, సింగరేణి ఎక్స్‌ప్రెస్, కాకతీయ ఎక్స్‌ప్రెస్, విజయవాడ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. బెల్గావి రైలు ను 2024 జనవరి నుంచి రద్దుచేశారు. ఇదిలా ఉండగా.. అమృత్ పథకంలో భాగంగా భద్రాచలం రోడ్డు రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. జాప్యం లేకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. పనులపై కూడా డీఆర్‌ఎం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పను లు వేగవంతం చేయాల్సిన అవసరముంది.

అత్యధిక ఆదాయం.. ఆదరణ కరువు..

పారిశ్రామిక జిల్లాగా పేరున్న భద్రాద్రి కొత్తగూ డెం నుంచి నిత్యం ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, కాంట్రాక్టర్లు, అధికారులు పలు అవసరాల నిమిత్తం వచ్చి వెళ్లే వారిసంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కానీ, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైళ్లు నడపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారు లు ఆదాయానికే అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రయాణికుల సౌకర్యాలను గాలికి వదిలేశారనే ఆరోపణలున్నాయి. సౌత్ సెంట్రల్ రైల్వేలో అత్యధిక ఆదాయం భద్రాచలంరోడ్డు రైల్వేస్టేషన్ నుంచే గడిస్తున్నారు. బొగ్గు రవాణా ద్వారా ఏడాదికి సుమారు రూ.650 కోట్లకుపైగా ఆదాయం పొందుతున్నారు. కరోనా సమయం నుంచి బీడీసీఆర్ స్టేషన్ నుంచి నడిచే రైళ్లు పూర్తిస్థాయిలో ప్రయాణికులకు సేవలందించడం లేదు.

రైల్వే డీఆర్‌ఎం హామీ ఇచ్చారు..



భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి షిరిడీ, తిరుపతికి రైళ్లు నడిపించే విధంగా చర్యలు తీసుకుంటా మని డీఆర్‌ఎం హామీఇచ్చారు. ఆయన హామీ ప్రకా రం రైళ్లు ఏర్పాటు చేస్తే ప్రైవేట్ వాహనాలు, బస్సు ల్లో వెళ్లే బాధలు తప్పుతాయి. రైలు ఏర్పాటుతో కుదిరిన సమయంలో మొక్కులు తీర్చుకునే అవ కాశం భక్తులకు దొరుకుతుంది.

–శ్రీనివాసరెడ్డి, రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడు

తెగిపోయిన డైవర్షన్ రోడ్డు

బురదలో ప్రజల పాట్లు



కోతకు గురైన డైవర్షన్ రోడ్డు

ములకలపల్లి: ములకలపల్లి శివారులో ఊరవాగుపై వేసిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. తాజా వర్షాలతో కోత ఏర్పడగా తాళ్లపాయ జీపీపాటు, రింగిరెడ్డిపల్లి, బూర్గుకొయ్యగుంపు, మధ్యగుంపు, మంగలిగుట్ట, సుందర్‌నగర్ తదితర గ్రామాలకు వెళ్లే వాహనాలకు దారి మూసుకుపోయింది. ఈ వాగుపై రెండేళ్ల కిందట హైలెవెల్ వంతెన నిర్మాణం మొదలుపెట్టినా నేటికీ పూర్తి కాలేదు. గతేడాది పలుమార్లు డైవర్షన్ రోడ్డు తెగిపోవడంతో ఇనుప వంతెన వేశారు. కానీ, దీనిపైకి చేరే మార్గం బురదమయం కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కాగా, వాగు వద్ద తెగిన డైవర్షన్ రోడ్డును ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు.

మైనార్టీ పాఠశాలల ఆర్‌సీఓగా అరుణకుమారి



అరుణకుమారి

కొణిజర్ల: ఉమ్మడి జిల్లాలోని తెలంగాణ మైనార్టీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల ప్రాంతీయ సమన్వయ కర్త(ఆర్‌సీఓ)గా ఎం.జే.అరుణకుమారి నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం కొణిజర్ల మండలం అమ్మపాలెం మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, ఆర్‌సీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా పర్యవేక్షిస్తానని తెలిపారు.

కళలపై మక్కువ పెంపొందించాలి



విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న పీఓ రాహుల్

దుమ్ముగూడెం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు చదువుతోపాటు వారికి నచ్చిన కళలపై ఇష్టాన్ని పెంపొందించాలని, వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, గ్రంథాలయం, బోధిస్తున్న పాఠ్యాంశాలను పరిశీలించారు. ముందుగా మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న పిల్లలకు ఇంగ్లిష్ పదాలను బోర్డుపై రాయించి వాటి అర్థాలను తెలుగులో చెప్పించారు. అనంతరం ఆరు నుంచి 9వ తరగతి వరకు నిర్వహిస్తున్న క్లాసులను, బోధనా తీరును పరిశీలించారు. చిన్నారుల చేత ఇంగ్లిష్ పదాలను బోర్డుపై రాయించి వాటి అర్థాలను తెలుగులో పూర్తిగా చెప్పేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అదనంగా విద్యార్థులకు ఇష్టమైన వ్యాసరచన, క్విజ్, నాటికలు, ఏకపాత్రాభినయానికి సంబంధించిన కళలపై అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాలు మొదలైనందున రాత్రిపూట విద్యార్థులు బయటకు రాకుండా చూడాలని, ప్రతీ రోజు వంటగది శుభ్రం చేసి మెనూ ప్రకారం విద్యార్థులకు వేడిగా ఆహారాన్ని వడ్డించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఎన్నికల జిమ్మిక్కే..

- బీసీ రిజర్వేషన్లు అమలయ్యేవరకు ఎన్నికలు వద్దు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన నాయకులు

ఖమ్మంఅర్బన్/నేలకొండపల్లి: రైతులను మభ్యపెట్టి ఓట్లు సాధించేలా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని ఇచ్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఇది నిజమైన సంక్షేమం కాదని, కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనని ప్రజలంతా భావిస్తున్నారని తెలిపారు. ఖమ్మంలో ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ కుటుంబంతో పాటు నేలకొండపల్లి మండలం అప్పలనరసింహాపురంలో తెలంగాణ జాగృతి నాయకురాలు అనిత తండ్రి నల్లబోతు నరసింహారావు మృతి చెందగా వారి కుటుంబాలను కవిత బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఖమ్మంలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా వడ్ల కొనుగోలులో ఇబ్బంది ఎదుర్కొన్న రైతులను పలకరించలేదని తెలిపారు. సన్న రకం పేరుతో బోనస్ అంటూ రైతులను మభ్యపెట్టారని చెప్పారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలని, అప్పటి వరకు ఎన్నికలు నిర్వహించొద్దని డిమాండ్ చేశారు. బిల్లు ఆమోదానికి ఈనెల 17న రైల్‌రోకో నిర్వహిస్తుండగా, మద్దతు ఇవ్వాలని బీసీ సంఘాలను కోరడమే కాక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు లేఖ రాశామని ఆమె వెల్లడించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలేమయ్యాయి?

ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని ఎమ్మెల్సీ ధ్వజమెత్తారు. ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధిని విస్మరించడమే కాక ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కాగా, గోదావరి జలాల తరలింపుపై జిల్లా మంత్రులు మాట్లాడకపోవడం ఏమిటని ప్రశ్నించిన కవిత, భద్రాద్రి రాముడి అభివృద్ధికి ఏపీలో విలీనమైన ఐదు గ్రామాలను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో పాటు కూరాకుల నాగభూషణం, గుండాల కృష్ణ, సేవాలాల్‌నాయక్, కిషన్‌నాయక్, వాంకుడోత్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నాటుకోళ్ల చోరీకి విఫలయత్నం



మసీద్ మూత్రశాలలో దాచిన కోళ్లు

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లిలో పలువురు దుండగులు నాటుకోళ్ల చోరీకి యత్నించారు. గ్రామంలోని అబ్దుల్‌కలాంబజార్‌కు మంగళవారం అర్ధరాత్రి చేరుకున్న సుమారు పదిమంది పలువురి ఇళ్లలో నుంచి 50 నాటుకోళ్లను అపహరించి సమీపంలోని మసీద్‌లోని మూత్రశాలల్లో దాచారు. ఆపై ఇంకొన్ని కోళ్లను చోరీ చేసేందుకు కొందరు యత్నిస్తుండగా, మిగతా వారు దాచిన కోళ్లను తరలించే యత్నంలో నిమగ్నమయ్యారు. బుధవారం తెల్లవారుజామున నమాజ్ సమయం కావడంతో మసీద్ కమిటీ ఉపాధ్యక్షుడు బషార్ వచ్చేసరికి కోళ్ల అరుపులు వినిపిస్తుండడంతో చూసేసరికి దొంగలు పారిపోయారు. ఆపై గ్రామస్తులు చేరుకుని ఎవరి కోళ్లను వారు తీసుకెళ్లారు.

జూదరుల అరెస్ట్

ములకలపల్లి: హౌజీ (జూదం) ఆటాడతున్న 9 మందిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని మొగరాలగుప్ప గ్రామంలో హౌసీ ఆట ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐ సిబ్బందితో దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1,680 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలిపై కేసు

పాల్వంచ: సకాలంలో వైద్యం అందించక పోవడంతో శిశువు మృతి చెందిన ఘటనలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. లక్ష్మీదేవిపల్లి మండలం తోకబందాలకు చెందిన రాంప్రసాద్ తన భార్య కరుణకు నొప్పులు రావడంతో గత మంగళవారం పాల్వంచ సీహెచ్‌సీకి తీసుకొచ్చాడు. ఆమెను ఉదయం 10.30 గంటలకు పరిశీలించిన వైద్యురాలు అనూషలక్ష్మీ నార్మల్ డెలివరీ అవుతుందని తెలిపారు. ఆపరేషన్ చేయమని కోరుతున్నా వినకుండా బ్లీడింగ్ అవుతున్నా ఎక్సర్ సైజ్ చేయించారని, అనంతరం 12.50 గంటలకు ఆపరేషన్ చేసి మగ శిశువును అందించి చనిపోయాడని చెప్పారని, వైద్యురాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి సకాలంలో ఆపరేషన్ చేస్తే శిశువు మృతి చెందే పరిస్థితి ఉండేది కాదని రాంప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

ఇల్లెందు: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తనను వరకట్నం కోసం వేధిస్తున్నాడని ఆరోపిస్తూ పట్టణంలోని జేకేకాలనీకి చెందిన బండారు మౌనిక బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి.. జేకేకాలనీకి చెందిన బండారు వీరన్న, మౌనిక ప్రేమించి పెద్దలను ఒప్పించి కులాంతర వివాహం చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు కలిగిన తరువాత భర్త వీరన్న, అతని తల్లితండ్రులు, ఆడపడుచు వరకట్నం తేవాలంటూ మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తున్నారని, భర్త మద్యం సేవించి తమ కుటుంబం పట్ల అసభ్యకరంగా దూషిస్తున్నాడని మౌనిక ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'బ్లీచింగ్‌కూ నిధులు ఇవ్వని ప్రభుత్వం'

నేలకొండపల్లి: రాష్ట్రంలో కొందరు మీడియా ముసుగులో తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు కూడా నిధులు రాకపోవడం, ట్రాక్టర్లలో డీజిల్ పోయించే పరిస్థితి లేక కార్యదర్శులు సెలవులో వెళ్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనే ఈ ప్రభావం కనపడుతుందని ఎమ్మెల్సీ ధీమా వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ పనులకు వెళ్లి పాముకాటుకు గురై, ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వివాహిత చెందింది. ఎస్‌ఐ యయాతిరాజు కథనం ప్రకారం.. మండలంలోని దురదపాడుకు చెందిన కురం దేవి (50) గత నెల 28వ తేదీన వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లి వస్తుండగా ది. మార్గమధ్యలో పాముకాటుకు గురైంది. పాము కనిపించకపోవడంతో ఏదో పురుగు కాటేసిందనుకుంది. రెండు రోజుల తర్వాత కాలు వాపు రావడంతో కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పాముకాటు గురైనట్లు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. మంగళవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి భర్త చిన్నరాజులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఓ గిరిజనుడిని హతమార్చిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఊసూరు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన రామ్‌ను మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి హతమార్చి మృతదేహాన్ని బుధవారం తెల్లవారుజామున ఊసూరు సమీపంలో పడవేశారు. కుటుంబీకులు మృతదేహాన్ని ఘటనా ప్రాంతం నుంచి గ్రామానికి తరలించారు. సమాచారం అందుకున్న సూరు పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలు సేకరించారు.

మందుపాతర పేలి గిరిజనుడికి తీవ్రగాయాలు

చర్ల: పోలీస్ బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ గిరిజనుడికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా మద్దేడు పోలీస్‌స్టేషన్ పరధిలోని పెగడపల్లి గ్రామానికి చెందిన విశాల్ గోటే సమీపంలోని సిరికొండ – దంపాయి మధ్య అటవీ ప్రాంతానికి వెళ్లాడు. మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబును గమనించకుండా తొక్కడంతో అది పేలి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని జగ్దల్‌పూర్ మెడికల్ కళాశాలకు తరలించారు. ఏఎస్పీ చంద్రకాంత్ గ్రామానికి చేరుకొని క్షతగాత్రుడితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పినపాక: ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేయగా మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని కోట్లపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోట్లపల్లికి చెందిన పూణెం సంప్రీత్.. సింగరేణిలో ప్రైవేట్ సెక్యూరిటీ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికిన దళారికి రూ.1,50,000 ఇచ్చాడు. ఆయన ఉద్యోగం ఇప్పించకపోగా ఇంకో రూ.30 వేలు ఇవ్వాలని అడిగాడు. దీంతో ఇచ్చిన డబ్బులు తిరిగి వస్తాయో రావో అన్న మనస్తాపంతో సంప్రీత్ పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు మణుగూరు వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. దళారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంప్రీత్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.